వెన్నుపోటు చంద్రబాబు నైజం



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: చంద్రబాబు ఆడే ప్రతీ హామీ, మాట మోసమేనని, వెన్నుపోటు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చంద్రబాబు ఏడాది పాలనపై పార్టీ ప్రచురించిన పుస్తకాన్ని నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రి లోకేష్ రచించిన రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు గురించి ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలులో ఒకటి, రెండు హామీలు అరకొరగా ఇచ్చి, ప్రజలు ఎవరైనా సూపర్ సిక్స్ గురించి మాట్లాడితే వారి నాలుక మందం అని సీఎం చంద్రబాబు అనడం పేదలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఏంటో తేటతెల్లమైందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో శ్రీకాకుళం జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. 16 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మన జిల్లాకు చేసింది శూన్యమన్నారు. టీడీపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందన్నారు. నాలుగేళ్ల తరువాత వచ్చేది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, ఆమదాలవలస మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాస రావు, ఆమదాలవలస మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, జిల్లా ఇంటెలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, మానుకొండ వెంకట రమణ, సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సత్యం, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి మన్మథ, మామిడి రమేష్, దన్నాన అజయ్‌కుమార్, అన్నపు కృష్ణ, బాలరాజు, రాఘవేంద్ర, భాను, తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- నరసన్నపేటలో కూటమి ప్రభుత్వ మోసాలపై వెన్నుపోటు పుస్తకావిష్కరణ

నరసన్నపేట: గత ప్రభుత్వ కాలంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఒక నమ్మకమని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అంటే అంతా మోసమే కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్సార్‌సీపీ ప్రచురించిన వెన్నుపోటు పుస్తకాన్ని స్థానిక నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతి, సుస్థిరిత, నిబద్ధత, సంకల్పం, సంక్షేమం, సమగ్రాభివృద్ధి, అధికార వికేంద్రీకరణ, గ్రామ స్వరాజ్యం, ఇంటింటికీ సేవలు పేరిట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పాలన జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అశాంతి, అరాచకం, ఆటవికం, రాజ్యాంగ ఉల్లంఘన, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు, అన్యాయాలు, అబద్ధాలు, ఏకపక్ష పాలన జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం ప్రజల కోసం పని చేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో కూటమి నాయకుల కోసమే పాలన జరుగుతుందని విమర్శించారు. ఈ తేడాలను ప్రజలు గమనించాలన్నారు. ఇచ్చిన హామీలు మొదటి ఏడాది నుంచే వైఎస్ జగన్ అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలతోపాటు 143 హామీలు అమలు ఎగ్గొట్టిందన్నారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎలా ఎగ్గొట్టారో ఇప్పుడు కూడా అలానే చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఇప్పుడు కూటమి నాయకులు, కార్యకర్తలకే పథకాలు అందుతున్నాయన్నారు. మద్యం పాలసీని మార్చి వీధివీధినా బెల్ట్ షాపులు పెట్టారన్నారు. ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీకి స్వస్తి చెప్పి ప్రజలకు అగచాట్లుకు గురి చేస్తున్నారన్నారు. పేరుకే ఇసుక ఉచితమని, దీనివలన ప్రజలకు మాత్రం ప్రయోజనం లేదన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలకు మేలు జరుగుతుందన్నారు. ఈ విధంగా ఏడాది పాలనలో కూటమి అన్ని విధాలుగా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. వికేంద్రీకరణ పేరున రాష్ట్రంలో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలని వైఎస్ జగన్ భావిస్తే.. ఇప్పుడు రాజధాని పేరున అమరావతి ఒక్క ప్రాంతాన్ని మాత్రమే అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, దీని వలన మిగిలిన ప్రాంతాలు వెనకబడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీలు వాన గోపి, ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, బగ్గు రామకృష్ణ, కేసీహెచ్‌బీ గుప్త, కనపల శేఖరరావు, యాబాజి రమేష్, కణితి కృష్ణారావు, మొజ్జాడ శ్యామలరావు, జి.వి.రమణి, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: ఈ నెల 18వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు సోమవారం తెలిపారు.

పాతపట్నం సబ్ స్టేషన్ 33 కేవీలో లైన్ షిఫ్టింగ్ పనులు చేపడతామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతపట్నం శివానీనగర్, పెట్రోల్ బంక్ ఏరియా, బొరుభద్ర, బూరగాం, కొరసవాడ, సీతారాంపల్లి, శివరాంపురం, కమలమ్మకొట్టు కూడలి, గురండి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్‌పై ఫిర్యాదు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న మామిడి శ్రీకాంత్, బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ అడపాక శంకరరావుపై వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకుండా, ఆ నిధులను సర్పంచ్ భార్య బ్యాంకు ఖాతాలకు రూ.2.80 లక్షలు అక్రమంగా జత చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేకుండా మరో రూ.7.20 లక్షలు సర్పంచ్ భార్య ఖాతాకు జమ చేశారన్నారు. నిధుల దుర్వినియోగంపై పలుసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీ సమీపంలో ఉన్న వంశధార వరద గట్టుపై అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాంటూ బూర్లె శ్రీనివాసరావు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. హిరమండలం రిజర్వాయర్‌కు వెళ్లే ఫ్లడ్ ఫ్లో కెనాయిల్‌పై అక్రమ నిర్మాణాలు చేయడం వలన వరదగట్టు బలహీన పడే ప్రమాదం ఉందన్నారు. అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని కోరారు.

కక్షగట్టి నిర్మాణాల కూల్చివేత..!



కూల్చివేసిన నిర్మాణాలు

సరుబుజ్జిలి: గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరించామనే కారణంతో కూటమి నేతలు తమ ఇళ్లను కూల్చివేశారని స్థానిక చిగురువలస కాలనీకి చెందిన జరుగుళ్ల రాజారావు, సొండి వెంకటరమణ సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితం ఇందిరమ్మ కాలనీల పేరుతో అప్పటి ప్రభుత్వం స్థలం మంజూరు చేసిందన్నారు. ఆ స్థలంలో ఇళ్లు కట్టుకొని జీవిస్తున్నామని తెలిపారు. గ్రామంలో కొంతమంది అధికార పక్షానికి చెందిన నేతలు తమపై కక్షగట్టి తమ నిర్మాణాలు కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా యంత్రాలను పెట్టి నిరంకుశంగా ఇళ్లను తొలగించారని వాపోయారు. అకారణంగా తొలగించడం వలన తమ కుటుంబాలు రోడ్డున ఉండాల్సిన వచ్చిందన్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఒరియా ఉపాధ్యాయులను నియమించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

పాతపట్నం: మండలంలోని చంగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒరియా ఉపాధ్యాయులను నియమించాలని, ఒరియా మాధ్యమంలో అన్ని సబ్జెట్‌లను బోధించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం పాఠశాల వద్ద ఎంఈఓ-2 సి.హెచ్.తిరుమలరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులు కలిసి ఎంఈఓకు ఒరియా ఉపాధ్యాయులు నియమించాలని, లేకపోతే హైస్కూల్ తమకు వద్దని వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గతంలో తెలుగు, ఒరియా పాఠశాలలు వేర్వేరుగా ఉండేవన్నారు. ఇప్పుడు ఉన్నత పాఠశాలగా ప్రభుత్వం ప్రెమోట్ చేసిందని, ఇంగ్లిష్ మీడియంలో బోధనలు జరుగుతాయన్నారు. భవిష్యత్‌లో అన్ని పాఠశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియం ఉంటుందని, ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించాలన్నారు. గ్రామస్తులు తెలిజేసిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఎంఈఓ తెలిపారు. హెచ్‌ఎం మురళీ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

51 మంది ఉపాధ్యాయుల బదిలీ

నరసన్నపేట: మండలంలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. 156 మంది బదిలీలకు దరఖాస్తులు చేసుకోగా 51 మందికి బదిలీ అయింది. దీంట్లో ఇతర మండలాల నుంచి 25 బదిలీపై నరసన్నపేట మండలానికి వచ్చారు. ఇదే మండలంలో ఉన్న వారిలో 26 మంది వివిధ స్కూళ్లకు అంతర్గత బదిలీ అయ్యారు. అందరూ సోమవారం బాధ్యతలు స్వీకరించారని ఎంఈఓ శాంతారావు తెలిపారు. హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు చెరో ఐదుగురు ఉపాధ్యాయులు మండలానికి అదనంగా వచ్చారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తూరు: మండలంలోని కల్లెమ్మ ఆర్‌ఆర్ కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే కాలనీకి చెందిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపాటి రామరాజు కొత్తూరు నుంచి కల్లెమ్మ కాలనీ వైపు బైక్‌పై వెళ్తుండగా.. పాలకొండ నుంచి ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన రామరాజును కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. రామరాజుకు ఢీకొన్న వ్యాన్ నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. సీసీ కెమెరాలను పరిశీలించి వ్యాన్‌ను రాజాంలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలి



పర్ణశాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: మండలంలోని కూర్మ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటనలో నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. సోమవారం కూర్మ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న కృష్ణ భక్తులను కలిసి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని కోరారు. ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, పార్టీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, పొదిలాపు శ్రీరాములు, గొర్లె తిరుపతిరావు, పల్లి గోవిందరావు, గోళ్ల నాగేశ్వరరావు, జి.మోహన్‌రావు, సనత్ పాణిగ్రహి, రమేష్, తదితరులు ఉన్నారు.

పరామర్శ..



పందిరి సూరప్పడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి పాత ఆమదాలవలసకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పందిరి సూరప్పడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. మున్సిపాలిటీలోని వెంకయ్యపేట గ్రామానికి చెందిన ముగడ సూర్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుమారిడి చదువు నిమిత్తం కొంతమొత్తం ఆర్థికసహాయం అందజేశారు. ఆమదాలవలస గేటు, ఆమదాలవలస మండలంలోని కొర్లకోట, దూసిపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు బొడ్డేపల్లి రాజు, పొదిలాపు తిరుపతిరావు, బండి ఎర్రన్నాయుడు, అన్నెపు కృష్ణ, పాగోటి భాను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఎల్.ఎన్.పేట: మండల వ్యవసాయ అధికారి (ఏఓ)గా కొర్ను సింహాచలం సోమవారం విధుల్లోకి చేరారు. భామిని ఏఓగా పనిచేస్తున్న సింహాచలం బదిలీపై ఎల్.ఎన్.పేట వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏఓ పైడి లతశ్రీ ఆమదాలవలస భూసార పరీక్ష కేంద్ర కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

సూపరింటెండెంట్‌గా శ్రీనివాసరావు

నరసన్నపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పెదిలాపు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఆర్‌ఐగా, సివిల్ సప్లయ్ డీటీగా నరసన్నపేటలో పనిచేశారు. శ్రీనివాసరావును వీఆర్వోలు అభినందించారు.

సరుబుజ్జిలి ఏఓగా మన్మథరావు

సరుబుజ్జిలి: మండల వ్యవసాధికారిగా కె.మన్మథరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాలకొండ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఏఓగా బాధ్యతలు నిర్వహించిన బొడ్డేపల్లి పద్మనాభం ఆమదాలవలస మట్టి నమూనా కేంద్ర కార్యాలయం అధికారిగా బదిలీపై వెళ్లారు.

పే స్కేల్ అమలు చేయాలి

పాతపట్నం: తెలంగాణాలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలో వీఆర్‌ఏలకు కూడా పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్‌ఏలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని పాతపట్నం మండల వీఆర్‌ఏలు పి.వి.రమణ, బి.రాజారావు, పి.అప్పలస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ పండిత బాబీకి వీఆర్‌ఏలు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి డ్యూటీలు వేయించడం వెంటనే విరమించాలన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్‌ఏ పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వై.రామారావు, బి.రవణమ్మ, దేవాది లక్ష్మి, ఆరుద్రమ్మ, ఆర్.సావిత్రి, పి.సుజాత, వి.అనసూయ ఉన్నారు.

పైడితల్లీ.. పాహిమాం



పొందూరు: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పొందూరు పైడితల్లి అమ్మవారు పేరొందారు. అమ్మవారి పండగలు ఆదివారం నుంచి ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారి ఆలయం నుంచి శ్రీశైనవాడ వరకు సిరిమానోత్సవాన్ని నిర్వహించనున్నారు. పొందూరు, క్రిష్టాపురం, లక్ష్మీపేట, జోగన్న పేట, అలబోయిన పేట, ఎరుకుల పేట, ఎరుకుల కాలనీలకు సంబంధించిన ఏడూ ఊర్ల పండగ కార్యక్రమానికి ఐదులక్షల మంది వరకు హాజరుకానున్నట్లు అంచనా. 16 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న పండగ కావడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీధులన్నీ విద్యుత్ అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. చిన్నారులకు సంబంధించి వినోద కార్యక్రమాలతో పొందూరు కళకళలాడుతోంది. సంగీత విభావరిలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. బుధవారం అనుపు కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్నాయి.